క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ బాలికల దినోత్సవం



మోపిదేవిలంక(మోపిదేవి): ప్రపంచ బాలికల దినోత్సవం మండల పరిధిలోని మోపిదేవి లంక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ వి. రాధ మాట్లాడుతూ ఆడపిల్లల వివాహ వయస్సు, చదువు, వారి హక్కులు, రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుకన్య పాల్‌కు అమేజింగ్ గ్రేస్ అవార్డు



నాగాయలంక: టి.కొత్తపాలెం శివారు డేగలవారిపాలెంలో నెహెమ్యా మినిస్ట్రీస్ చైల్డ్ డైరెక్టర్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు పాస్టర్ సాలి సుకన్యపాల్‌కు అమేజింగ్ గ్రేస్ అవార్డు లభించింది. అమెరికాకు చెందిన హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ (ఎస్‌ఏటీఏ-యూఎస్‌ఏ) ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన పాస్టర్ల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ బి.ఆనంద్ చేతుల మీదుగా ఆమె అవార్డును స్వీకరించారు. ఆమెను పలువురు అభినందించారు.

నాగాయలంకలో ఐఎస్ఓ జిల్లా కో-ఆర్డినేటర్ పర్యటన



నాగాయలంక: ఐఎస్ఓ కృష్ణాజిల్లా కో-ఆర్డినేటర్ పి.బేతు బాలకృష్ణ బుధవారం నాగాయలంక గ్రామంలో పర్యటించారు. పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ ద్వారా అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను, నిర్వహణ తీరును పరిశీలించారు. సచివాలయ వ్యవస్థ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఉప సర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు (నాని) ఆమెను దుశ్శాలువాతో సత్కరించారు. లైజనింగ్ అధికారి దిలీప్ కుమార్, ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, పంచాయతీ కార్యదర్శి జె.పవన్ కుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారంతో రహదారి అభివృద్ధి

అశ్వరావుపాలెం(అవనిగడ్డ): దాతల సహకారంతో మోదుమూడి-అశ్వరావుపాలెం రహదారిని అభివృద్ధి చేశారు. ఈ రహదారిపై గోతులు పడటంతో విద్యార్థులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారి అభివృద్ధికి గ్రామానికి చెందిన యక్కటి సుబ్బారావు రూ.25 వేలు, విశ్వనాథుని బసవశంకరరావు రూ.25 వేలు, మాదివాడ రాము-పద్మావతి రూ.25 వేలు, రేపల్లె పార్థసారథి రూ.25 వేలు, యక్కటి నరేష్ రూ.10 వేలు అందించగా మెటీరియల్ తోలి కూలీలతో సరి చేయించారు. రహదారి అభివృద్ధికి సహకరించిన దాతలకు సర్పంచ్ పి. లంకమ్మ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

కంప్యూటర్ బహూకరణ

చల్లపల్లి: ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్‌బాబు రూ.40 వేలు విలువ కలిగిన నూతన కంప్యూటర్‌ను బహూకరించారు. ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని), డీటీ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అండగా ఉన్నాం.. ఆదరించండి

- మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి
- గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం
- ఎంపీ బాలశౌరితో కలిసి సచివాలయం నూతన భవనం ప్రారంభం





లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి; కమలాపురం గ్రామ సచివాలయం భవన శిలాఫలకం ఆవిష్కరణ దృశ్యం

పెడన: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తూ జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తోందని, వారి ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్న జగనన్నను మరోసారి ఆదరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. బుధవారం మంత్రి జోగి రమేష్ ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి కమలాపురం, ఉప్పల కలువగుంటపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం, ఆర్‌బీకే నూతన భవనాలను, చేవేంద్ర జెడ్పీ హెచ్‌ఎస్‌లో అదనపు తరగతి గదులను ఎంపీ, మంత్రి ప్రారంభించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలు తీరుకు సంబంధించి ప్రతి ఒక్కరినీ కలిసేందుకు, వారి యోగ క్షేమాలతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వివరిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని సద్వినియోగం చేసుకుని సమాజంలో అందరూ గౌరవంగా జీవించాలని సూచించారు. జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని కోరారు. పథకాలు అందుకున్న వారంతా వీటి అమలు వెనుక ఉన్న మంచి ఆలోచనను, సామాజిక దృక్పథం, సానుకూల ప్రయోజనాన్ని గుర్తించాలని చెప్పారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందుకోవాలంటే పెత్తందారులు, మధ్యవర్తులు మధ్యలో అడ్డంకిగా ఉండేవారని, వారికి చేతులు తడిపితే కాని పథకాలు అందేవి కావన్నారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదన్నారు. ఇదీ అసలైన మార్పు అంటే అని చెబుతూ.. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో బలహీనులు, నిస్సహాయులు దర్జాగా జీవిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఓటీఎస్ ద్వారా పలువురు లబ్ధి దారులకు ఇంటి రిజిస్ట్రేషన్ దస్తావేజులను వారు అందజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి మంత్రి జోగి రమేష్ పెడన మండలం కమలాపురం సచివాలయం పరిధిలోని ఉప్పలకలవగుంట గ్రామంలో రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పెడన మండలం చేవేంద్ర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకంలో భాగంగా రూ.65.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, ఎంపీపీ వాణి, వైస్ ఎంపీపీ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు నాగబాబు, రామానాయుడు, అచ్యుతరావు, సర్పంచ్ గుడిశేవ శ్రీనివాసరావు, ఎంపీటీసీ అంకెం నరసింహారావు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు స్థానిక నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

- కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేత



భావదేవరపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



ముక్కొల్లు శిబిరంలో మందుల పంపిణీ



పెడన మండలం గురువిందగుంట శిబిరంలో..

నాగాయితిప్ప(మోపిదేవి): ప్రజలకు మెరుగైన వైద్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని పలువురు వక్తలు అన్నారు. అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష శిబిరాలు కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన శిబిరాల్లో వైద్యులు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మోపిదేవి మండలం నాగాయితిప్ప ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరరావు, మోర్ల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన శిబిరంలో ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రంలో వైద్యం అందక ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడరాదని, గ్రామాల్లోనే ప్రజలకు అందుబాటులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని పేదలను దృష్టిలో పెట్టుకుని ఇంకా మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేశారని చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు కూడా ఇస్తున్నారని, ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ శ్రావణి, డాక్టర్ ప్రణయ రాఘవ, డాక్టర్ లక్ష్మీనాథ్, డాక్టర్ హారిక, డాక్టర్ శ్రీరాం సాయి, డాక్టర్ అభిషేక్‌సాయి 513 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు కోసూరు కోటేశ్వరరావు, తుటారం కృష్ణ, లింగం జగదీష్ కుమార్, తాతా శ్రీకాంత్, గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భావదేవరపల్లిలో..

భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లి సచివాలయంలో నాగాయలంక ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 580 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, సీతారామ్ కుమార్, క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ ఇంద్రకుమార్ రెడ్డి, డాక్టర్లు కె.శివరామకృష్ణ, శ్యామ్ ప్రసాద్, తారకేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చినగొల్లపాలెంలో..

కృత్తివెన్ను: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతలో భాగంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం చినగొల్లపాలెం -2 సచివాలయం పరిధిలో నిర్వహించారు. వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ముడా వైస్ చైర్మన్ రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు. శిబిరంలో ఎంపీడీఓ పిచ్చిబాబు, డీటీ శశికుమార్, సర్పంచ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

457 మందికి వైద్య పరీక్షలు

గూడూరు: గూడూరు మండలం ముక్కొల్లులో వైద్య శిబిరం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ శిబిరాన్ని ప్రారంభించగా మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి. మాధురి ఆధ్వర్యంలో మచిలీపట్నం, గూడూరు ఆసుపత్రుల వైద్యనిపుణులు 457 మంది రోగులకు పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పర్జం పెదబాబు, గొరిపర్తి రవికుమార్, సర్పంచులు సమ్మెట జయవర్దన్, గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

మల్లేశ్వరంలో..

బంటుమిల్లి: మల్లేశ్వరం సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 708 మందికి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. శిబిరాన్ని ఎంపీపీ వెలివెల చినబాబు, మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్‌తో కలిసి ప్రారంభించారు. పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి, ముడా వైస్ చైర్‌పర్సన్ కె. రాజ్యాలక్ష్మి పర్యవేక్షించారు. వైద్య నిపుణులు రంగనాథ్, సురేఖ, పవన్‌కుమార్, సౌందర్య, సువర్చల, జయశ్రీ వైద్య సేవలు అందజేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, సచివాలయం కన్వీనర్ సుబ్బారావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కోడూరులో..

కోడూరు: కోడూరు-3 సచివాలయం పరిధిలో బుధవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య నిపుణులు గంగాధర్, అనూష, మౌనిక, పార్వతి, జయచంద్రలు 450 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి ఎం.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, పరిశె మాధవరావు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో..

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధి 3వ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ మరియాదేవి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గణేష్ పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి..

పెడన: అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. చేవేంద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గురువిందగుంట వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. 509 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. 98 మందికి కంటి పరీక్షలు చేయగా 46 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించి కంటి వెలుగుకు సిఫార్సు చేశారు. 12 మందికి సర్జరీ చేయించుకోవాలని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. వైద్యులు అనూష, ప్రదీప్ కుమార్, శ్యామ్ తదితరులు వైద్యసేవలను అందజేశారు.

కోనేరుసెంటర్: మండల పరిధి గోకవరంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు సందర్శించారు. హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కిట్టు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ బాలకృష్ణ, తహసీల్దార్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే పేర్ని నాని



మాట్లాడుతున్న పేర్ని నాని, జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): నియోజకవర్గం పరిధిలోని భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కోరారు. జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో బుధవారం రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి మూడో దశ రోడ్డు, రైలు మార్గానికి భూ సేకరణ అంశంలో రైతుల నుంచి తీసుకోవాల్సిన భూమి వివరాలు, ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ, ఎంతమంది రైతుల నుంచి భూమి సేకరించాలి తదితర అంశాలపై చర్చించారు. భూ సేకరణకు ఎంతమేర నిధులు అవసరమవుతాయో ఆయన అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గం పరిధిలో 22ఎ (నిషేధిత భూములు)గా నమోదై ఉండి, రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఆ జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పెదయాదర, పోతేరు, పోలాటితిప్ప గ్రామాల్లో నిరుపేదలకు భూములు ఇచ్చేందుకు భూమిని సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మూడు గ్రామాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు భూమి అవసరం ఉన్న దృష్ట్యా సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్ని నాని సూచించారు. ఈ అంశాలపై జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పిన అంశాలపై త్వరతగతిన చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బందరు ఇన్‌చార్జి ఆర్డీఓ బి. శివనారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏఓ ఏఎస్ఎన్ రాధిక, తహసీల్దార్ శ్రీవిద్య, సర్వే శాఖ ఏడీ టి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్‌కు దాతల సాయం అభినందనీయం



బాలసదన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పేర్ని నాని, కలెక్టర్ రాజాబాబు తదితరులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో అసంపూర్తిగా ఉన్న బాలసదన్ భవన్‌ను అభివృద్ధి చేసేందుకు దాతలు చేసిన సాయం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. నగరంలోని పోర్టురోడ్డులో నూతనంగా నిర్మించిన బాలసదన్ భవనాన్ని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబుతో కలిసి పేర్ని నాని బుధవారం ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన భవనంలో అనాథ చిన్నారులు ఉండేందుకు డార్మిటరీ రూమ్‌లు, డైనింగ్ రూమ్, ఆఫీస్ రూమ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా బాలబాలికలకు దాతల సాయంతో నూతన వస్త్రాలను, దుప్పట్లను అందజేశారు. బాలసదన్‌లో బాలికలకు అవసరమైన మౌలిక వసతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారన్నారు. బాలికలకు మంచాలు, దుప్పట్లు దాతలు సమకూర్చారని చెప్పారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే, కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, 24వ డివిజన్ కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డీఎం శ్రీధర్, నగర కమిషనర్ జి. చంద్రయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

పేర్ని కిట్టు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. రెండో డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్ పరింకాయల విజయ చంద్రకుమార్‌తో కలిసి పేర్ని కిట్టు ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. ఈ పథకాలతో ప్రతి గడపకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. సంక్షేమ పథకాలతో పేదల కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కృత్తివెన్ను: జిల్లా స్థాయి ఆటల పోటీలకు రాళ్లరేవు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. బంటుమిల్లి, గూడూరులలో జరిగిన నియోజవర్గ స్థాయి పోటీల్లో రాళ్లరేవు పాఠశాల విద్యార్థులు 42 మంది ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజును హెచ్‌ఎం చంద్రమోహన్, సర్పంచ్ సునీల్, ముడా వైస్ చైర్మన్ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ పిచ్చిబాబు అభినందించారు.

గడప గడపకు నిధులతో డ్రెయినేజీ పనులు ప్రారంభం

చల్లపల్లి: స్థానిక పడమర వైపు ప్రధాన రహదారికి ఇరువైపులా ఇబ్బందికరంగా ఉన్న కచ్చా డ్రెయినేజీ స్థానంలో పక్కా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.9.50 లక్షలతో ప్రధాన రహదారికి ఇరువైపులా నూతన డ్రెయినేజీ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, పంచాయతీ పాలక వర్గ సభ్యులు బళ్లా లలితకుమారి పూజలు చేసి పనులు ప్రారంభించారు.

బాలికల్లో మనోస్థైర్యం నింపాలి

మచిలీపట్నంటౌన్: బాలికల్లో మనోస్థైర్యం నింపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని 42వ డివిజన్ బలరామునిపేట సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి రేష్మ అన్నారు. సచివాలయంలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నవయస్సు నుంచి యుక్త వయస్సు వరకు బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

నాగాయలంక: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు బుధవారం తెలిపారు. 15వ తేదీన శ్రీచక్ర కలశపీఠం స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు ఉంటాయని, ప్రతి రోజూ పూజలు, విశేష రోజుల్లో సామూహిక కుంకుమ పూజ, మూలానక్షత్రం రోజున సరస్వతీ పూజ నిర్వహిస్తామని తెలిపారు. నాగాయలంక కృష్ణానదీ తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం దేవాలయాల సముదాయంలోని కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తయ్యాయని శ్రీరామపాద క్షేత్రం కమిటీ వర్గాలు తెలిపాయి. గణపేశ్వరంలోని దుర్గా గణపేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారి దసరా ఉత్సవాలకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయని ధర్మకర్త ఎం. రాంబాబు బుధవారం వివరించారు.

ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: స్థానిక ఆజాద్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో 15 నుంచి 23వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయంలో బుధవారం శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆలయంలో 15వ తేదీ ఉదయం 8.30 గంటలకు ప్రథమ పూజలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజూ పలు పూజా కార్యక్రమాలు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు ఉంటాయని చెప్పారు. 20వ తేదీ మూలా నక్షత్రం సందర్భంగా బాలబాలికలచే సరస్వతి పూజలు, 24న కుమారిపూజలు, 25న వేదపండితుల సభ నిర్వహిస్తామని వివరించారు. ప్రతి రోజు ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం సభ్యులు లలితా సహస్రనామ పారాయణం చేస్తారన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం తరువాత జిల్లాలో దసరా వేడుకలను కన్యకా పరమేశ్వరి ఆలయంలో తొమ్మిదిరోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఎంపీ బాబాప్రసాద్, ఉపాధ్యక్షులు సామా వెంకటలక్ష్మీ కాంతారావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' విజయవంతం చేయండి

చల్లపల్లి: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సమిష్టి కృషితో విజయవంతం చేయాలని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీఓ చేకు చినరాట్నాలు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను వివరించారు. ప్రజల సమస్యల సత్వర పరిష్కార వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన

గూడూరు: మహిళలకు రక్షణ కల్పించే దిశ చట్టంపై బుధవారం మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు మచిలీపట్నం దిశ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్‌ఐలు ఆర్.సుశీల, హేమలత దిశ యాప్, పోక్సో, బాల్య వివాహాల నిరోధంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌ను అరికట్టడం, డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపేందుకు విద్యార్థులు ముందుకు రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.